# 2014 సాధారణ ఎన్నికల తీరు తెన్నులు- 1

-- ముత్తేవి రవీంద్రనాథ్ 98491 31029

తొమ్మిది విడతలలో ఏప్రిల్ 7 నుంచి మే 12 వరకు సుదీర్ఘంగా సాగిన 2014 సాధారణ ఎన్నికల కోలాహలం ఎట్టకేలకు మే 16వ తేదీన ఫలితాలు వెల్లడి కావడంతో ముగిసింది. ఈ సారి సాధారణ ఎన్నికలు 16 వ లోక్ సభకు ఎన్నికకావలసిన 543 మంది సభ్యులతోపాటు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిసా,సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల శాసన సభ్యులను కూడా ఎన్నుకునేందుకు ఉద్దేశించి జరిగాయి. దేశవ్యాప్తంగా ఉన్న 81 కోట్ల 45 లక్షల మంది అర్హులైన ఓటర్లలో సగటున 66.38 % మంది ఓటర్లు ఈ బృహత్తరమైన ఎన్నికలలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికలు జరిగిన తీరుతెన్నులు, వాటి పర్యవసానాలను ఇప్పుడు కనీసం స్థూలంగానైనా సమీక్షించుకొనడం అవసరం.

కోట్లాదిమంది తమ ఓటుహక్కును వినియోగించుకుని తమకు ఇష్టమైన అభ్యర్థులను లోక్ సభకు, కొన్ని రాష్ట్ర శాసనసభలకు తమ ప్రతినిధులుగా ఎన్నుకొన్న ఈ సుదీర్ఘమైన ప్రక్రియను పలు దేశాలు ప్రపంచ ప్రజాస్వామ్య ప్రక్రియలలో ఇదొక చెప్పుకునితీరాల్సిన మహాద్భుతమని పొగిడాయి. భారత రాజ్యాంగం యొక్క 324 వ అధికరణం క్రింద నియమితమైన స్వతంత్ర ప్రతిపత్తిగల భారత ఎన్నికల కమిషన్ ఈ ఎన్నికలను ఒక సవాలుగా స్వీకరించి, కఠినతరమైన ఈ ఎన్నికల ప్రక్రియను దాదాపుగా వివాదాలకు అతీతంగా నిర్వహించడం అభినందనీయం. మన ఎన్నికల ప్రక్రియ ఎంతగా లోపభూయిష్టమైనప్పటికీ, క్రమక్రమంగా అది తన బలహీనతలను అధిగమిస్తూ ముందుకు సాగుతూ ఉండడం గమనార్హం.

**ఓటరు జాబితాలు- పోలింగు శాతం**

అర్హులైన వయోజనులందరికీ ఓటువేసే హక్కు కల్పించబడాలని రాజ్యాంగంలోని 326 వ అధికరణం నిర్దేశిస్తున్నది. 18 సంవత్సరాలు నిండిన అర్హులైన పౌరులందరికీ ఓటు హక్కు కల్పించేందుకు పోలింగ్ జరిగే తేదీలవరకు కూడా పలు విడతలుగా పత్రికలు, టెలివిజన్ చానెళ్ళలో ప్రకటనలు ఇవ్వడం ద్వారా తగు ప్రచారం కల్పించి, ఎన్నికల కమిషన్ తన విధిని దాదాపు సక్రమంగానే నిర్వహించింది. సకాలంలో ఓటరుగా నమోదుకావడం, ఓటర్ల లిస్టులో తన పేరు ఉన్నదో లేదో చూసుకుని, లేనట్లయితే నమోదుకు దరఖాస్తు చేసుకొనడం, తన ఓటుహక్కును ప్రతి ఓటరూ నిర్భయంగా, స్వేచ్ఛగా వినియోగించుకుని, ఎటువంటి ప్రలోభాలకూ లోనుకాకుండా తనకు ఇష్టమైన వ్యక్తిని ప్రజా ప్రతినిధిగా ఎన్నుకోవడం వగైరా విషయాలలో ప్రజల చైతన్యం పెంచేందుకు ఎలక్షన్ కమిషన్ నిర్విరామ ప్రచారం నిర్వహించింది. ఈ ప్రచారానికి

అందుబాటులోలేనివారి కోసం పలు మార్లు ఓటరు నమోదు తేదీల గడువులను పెంచుతూ, వీలయిన మేరకు ఓటరు జాబితాలను సర్వసమగ్రంగా, లోపరహితంగా తయారు చేసేందుకు కమిషన్ ఈసారి కొంచెం గట్టిగానే ప్రయత్నించింది. ఈ విషయమై వారి ప్రయత్నంలో చిత్తశుద్ధి కొట్టవచ్చినట్లు కనపడింది. అయినా ఇంకా కొందరు ఓటర్ల నిర్లిప్తత, కొందరు అధికారుల నిర్లక్ష్య ధోరణి, రాజకీయ పార్టీల పట్టీపట్టనితనం కారణంగా అక్కడక్కడా జాబితాలలో కొన్ని వందల ఓట్లు గల్లంతు అయినట్లు పత్రికా వార్తలద్వారా తెలిసింది.ఓటరు జాబితా అసమగ్రంగా ఉండడానికి ఓటర్ల నిర్లిప్తత కూడా ఎలా కారణం అవుతుందో చూద్దాం. మనలో మన మాటగా అనుకుందాం. "ఫలానా అసెంబ్లీ సెగ్మెంటు ఓటరు జాబితా ఫలానా తేదీలలో ఫలానా కార్యాలయం నోటీసు బోర్డు మీద ఉంచబడుతుంది. దానిని సరిచూసుకుని సవరణలు ఏవైనా ఉంటే, ఫలానా తేదీ లోపు ఫలానా అధికారికి దరఖాస్తు పెట్టుకొనమ"ని వార్తాపత్రికలలోనూ, టి.వి. లలోనూ వస్తున్న ప్రకటనలు చూసి మనలో ఎంతమందిమి ఆ యా ఆఫీసులకి వెళ్లి జాబితాలో తమ పేరు ఉన్నదో లేదోనని సరిచూసుకుంటున్నాం -- చెప్పండి. నూటికి ఒక్కళ్ళం కూడా వెళ్ళం కదా ! మనం ఎలా ఉంటే దేశం కూడా అలాగే ఉంటుందని వేరే చెప్పాలా ? మనలో కూడా తప్పు పెట్టుకుని వేరొకరి బాధ్యతారాహిత్యాన్ని మాత్రమే విమర్శించడం కాకుండా ముందుగా మనల్ని మనం సరిచేసుకునే ప్రయత్నం చేద్దాం. ఈ విషయమై రాజకీయ పక్షాల, ఓటర్ల చైతన్యం, కనీసం ఉన్నతాధికారులలో చిత్తశుద్ధి మరింతగా పెరిగితే, ప్రభుత్వం బాధ్యతారహితంగా వ్యవహరించిన కింది అధికారులపై కఠిన చర్యలు చేపట్టి ఇటువంటి పొరపాట్లు పునరావృతం కాకుండా జాగ్రత్త పడవచ్చు. అయినా గతంతో పోలిస్తే ఇలా జాబితాలలో ఓట్లు గల్లంతయ్యాయనే ఆరోపణలు ఈసారి సాధారణ ఎన్నికలలో చాలా అరుదుగానే వినవచ్చాయి. ఈసారి ఎన్నికలలో ఓటరు ఫోటోతో కూడిన ఓటరు స్లిప్పులను ఒక బాధ్యత కలిగిన వి. ఆర్. ఓ. స్థాయి అధికారిచేత పోలింగు తేదీకి బాగా ముందుగానే ప్రతివారి ఇంటికి పంపి గృహ యజమాని సంతకం తీసుకునిమరీ ఓటర్లకు పంపిణీ చేయడం ముదావహం. లోగడ ఈ పనిని రాజకీయ పార్టీలు చేపట్టేవి. ఆ యా పార్టీల కార్యకర్తలు తమ పార్టీకి తప్పకుండా ఓటు వేస్తారనుకునేవారికి మాత్రమే ముందుగా స్లిప్స్ ఇంటికి తెచ్చి ఇచ్చేవారు. మిగిలినవారంతా పోలింగు తేదీనాడు ఆ యా పార్టీలు ఏర్పాటుచేసిన శిబిరాలవద్దకు వెళ్లి జాబితాలు వెతుక్కుని స్లిప్స్ రాయించుకోవలసి వచ్చేది. ఆ బూత్ జాబితాలో తమ పేరు లేకపోతే సంబంధిత రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి తమ పేరు ఎక్కడ నమోదయిందో, లేక గల్లంతయితే దానికిగల కారణాలేమిటో తెలుసుకొనడానికీ , వేరొక దూరమైన బూత్ జాబితాలో తమ పేరు ఉందని తెలుసుకున్నా, సకాలంలో అక్కడికి చేరుకుని ఓటు వేయడానికీ ఓటర్లకు ఎంతో ఇబ్బందిగా ఉండేది. ఎలక్షన్ కమిషన్ ఇప్పుడు పోలింగు తేదీకి బాగా ముందుగానే ఓటరు స్లిప్పులను ఓటర్లందరికీ నేరుగా వారి ఇళ్ళకే తెచ్చి పంపిణీ చేసే విధానం ప్రవేశపెట్టిన కారణంగా ఓటర్లకు ఈ ఎన్నికల నుంచీ ఆ తిప్పలు తప్పాయి.స్లిప్పులు అందనివారు సకాలంలో తమ నియోజకవర్గ

అధికారులను కలిసి, ఓటరు స్లిప్పు పొందే అవకాశం ఉంది. ఈ పద్ధతి కారణంగా ఒకే ఇంటి నంబరులో పెద్దసంఖ్యలో నమోదైన అక్రమ ఓటర్ల పేర్లు గుర్తించి, వాటిని తొలగించే వీలుంది. అంతేకాదు ; జాబితాలో నమోదైన ఓటరు చిరునామా సరయినదో కాదో ఇంటికి వెళ్ళిన అధికారికి స్వయంగా తెలిసే అవకాశం కూడా ఉంటుంది.

ఈ ఎన్నికలలో పోలింగు సమయాన్ని ఒక గంట ముందుకూ, ఒక గంట తరువాతకూ పొడిగించడం కూడా పోలింగు శాతం గణనీయంగా పెరగడానికి దోహదపడింది. పోలింగు ముగిసే సమయానికి వెళ్లి లైనులో నిలబడిన వారందరికీ ఓటు వేసే అవకాశం కల్పించాలనే నియమాన్ని ఈసారి కచ్చితంగా పాటించడం కూడా ఈ ఎన్నికలలో పోలింగు శాతాలు భారీగా నమోదవడానికి కారణమైంది.ఓటు విలువ గురించి, ప్రజాస్వామ్యాన్ని పటిష్టపరచేందుకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు వేయాల్సిన ఆవశ్యకత గురించి ప్రజల్ని చైతన్యపరచేందుకు ఎలక్షన్ కమిషన్ మాత్రమే కాక పలు స్వచ్ఛంద సంస్థలు సైతం చేపట్టిన ప్రచార కార్యక్రమాల కారణంగా కూడా ఈసారి ఎన్నికలలో ఓటింగు శాతంలో గణనీయమైన వృద్ధి కనిపించింది. అయితే ఈ చైతన్యం గ్రామీణులు, నిరక్షరాస్యులలో పెరిగినట్లు, పట్టణవాసులు, విద్యావంతులలో పెరగకపోవడం మాత్రం శోచనీయం. ఈ ఎన్నికలలో హైదరాబాద్ లో పోలింగు శాతం 53 కి కొంచెం అటూ ఇటూగా మాత్రమే నమోదుకావడం తాము విద్యావంతులం, నాగరికులం అనుకునేవారు సిగ్గుపడాల్సిన విషయం. ప్రజాస్వామ్య ప్రక్రియ మరింతగా బలపడాలంటే ప్రతి ఒక్కరూ ఎటువంటి ఒత్తిళ్ళకూ, ప్రలోభాలకూ లోను కాకుండా తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేయడం తమ బాధ్యతగా గుర్తించాలి.

ముందుముందు ఓటర్లంతా తమ ఈ బాధ్యత గుర్తెరిగి ఓటింగు ప్రక్రియలో ఇతోధికంగా పాలు పంచుకుని తమతమ ప్రజాస్వామ్య ఆకాంక్షలను వ్యక్తంచేసే సాధనంగా తమ ఓటుహక్కును సక్రమంగా వినియోగించుకొనగలరని ఆశిద్దాం.

**'నోటా'కు ఓటు**

ఇంతకు పూర్వం ఎన్నికలలో పోలింగుకు హాజరైన ఒక ఓటరు, పోటీ చేస్తున్న అభ్యర్థులలో ఎవరో ఒకరికి తప్పనిసరిగా ఓటు వేయాల్సి ఉండేది. ఈ ఎన్నికల నుంచీ పోటీపడే అభ్యర్థులలో ఏ ఒక్కరూ తనకు నచ్చని సందర్భంలో అభ్యర్థులలో ఎవరూ తనకు నచ్చలేదంటూ ' None of the Above' (NOTA) కు ఓటు వేసే అవకాశం ఓటరుకు కల్పించారు. ఇది నిస్సందేహంగా ఒక మంచి పరిణామమే. అభ్యర్థులు ఎవరూ నచ్చలేదని పోలింగుకు వెళ్ళకుండా ఇంట్లోనే కూర్చుంటే మన ఓటు వేరొకరు వేసే అవకాశం ఉంటుంది. అలా కాకుండా పోలింగుకు హాజరై, ఎన్నికలలో నిలబడిన అభ్యర్థులలో ఏ ఒక్కరికి ఓటు వెయ్యడమూ తమకు ఇష్టంలేదని తెలిపే NOTA బటన్ నొక్కడం కొంతవరకు మెరుగే. ఇప్పుడు ఈ నోటా

అవకాశం కల్పించబడినందున అభ్యర్థులు నచ్చని కారణంగానో లేక ఎన్నికల ప్రక్రియ మొత్తం డబ్బుమయం అయిపోయిందనే నిరసనభావంతోనో ఇంటినుంచి పోలింగు స్టేషనుకు రావడానికి ఇష్టపడనివారు కూడా పోలింగులో పాల్గొని తమ నిరసనను తెలిపే అవకాశం ఇవ్వబడినందున పోలింగు శాతాలు కూడా పెరిగే అవకాశముంది. అయితే ఈసారి ఎన్నికలలో నోటా గురించి ముందుగా తగినంత ప్రచారం చేయనందున పట్టణ ప్రాంత ఓటర్లలో ఎన్నికల పట్లగల పూర్వపు నిరాసక్తతలో ప్రస్తుతానికైతే పెద్దగా మార్పేమీ రాలేదు. అయితే ఇలా అందరూ తమకు నచ్చని అభ్యర్థులు పోటీలో ఉన్నప్పుడు 'నోటా' కు ఓటు వేస్తూ ఉంటే క్రమంగా రాజకీయ పార్టీలు కూడా ఎవరికి పడితే వారికి తమ పార్టీ టికెట్లు ఇవ్వడానికి వెనుకంజ వేస్తాయి.

**ఓటరు అనర్హతలు**

భారత రాజ్యాంగంలోని 326 వ అధికరణం ప్రకారం నిర్దిష్ట ప్రదేశంలో నివాసం ఉండకపోవడం (Non-Residence), మానసిక అస్వస్థత కలిగి ఉండడం ఓటరుకు అనర్హతలుగా పరిగణిస్తారు. ఓటరు గుర్తింపు కార్డులో పేర్కొనబడిన చిరునామాలో నివసించని, మానసిక స్వస్థతలేని ఓటర్లను ఎప్పటికప్పుడు గుర్తించి జాబితా నుంచి తొలగించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘం అధికారులదే. ప్రజా ప్రాతినిధ్య చట్టం లోని నిబంధనలను అనుసరించి తాను సాధారణ నివాసిగా ఉన్న నియోజకవర్గంలోనే ఏ వ్యక్తి అయినా ఓటరుగా నమోదు కావాలి. ఒక వ్యక్తికి మానసిక స్వస్థత లేనట్లుగా ఏదైనా కోర్టు నిర్ధారిస్తేనే ఆ వ్యక్తి పేరును ఓటర్ల జాబితా నుంచి తొలగించాలి. భారత దేశ పౌరులు కాని వ్యక్తులు మన దేశంలో ఓటరుగా ఉండేందుకు వీలు లేదు. అయితే ఒక వ్యక్తి ప్రస్తుతం ఏదయినా విదేశంలో నివసిస్తున్నా, ఇంకా భారత పౌరసత్వం కలిగివున్నట్లయితే మాత్రం తన శాశ్వత చిరునామాలో ఓటరుగా నమోదు కావచ్చు. ప్రతి వ్యక్తీ ఏదైనా ఒక్క నియోజకవర్గంలోనే ఓటరుగా తన పేరును నమోదు చేసుకోవాలి. వేర్వేరు నియోజకవర్గాలలో తన పేరు నమోదు చేసుకోవడం, ఒకే నియోజక వర్గంలో వేర్వేరు ప్రదేశాలలో ఓటరుగా నమోదు చేసుకోవడం చట్టవిరుద్ధం. అలాగే నేరాలు రుజువై శిక్ష పడిన నేరస్థులను, అవినీతి , చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేసిన నేరానికి రాజ్యాంగం లేదా మరేదైనా చట్టం క్రింద శిక్షపడి, ఓటరుగా అనర్హులైనవారిని కూడా ఎప్పటికప్పుడు గుర్తించి ఓటరు జాబితా నుంచి తొలగించే బాధ్యతకూడా ఎన్నికల సంఘం అధికారులదే. భారత శిక్షా స్మృతి, 1860 యొక్క సెక్షన్ 171 E మరియు సెక్షన్ 171 F కింద శిక్ష విధించబడినవారు శిక్ష విధించబడిన తేదీనుంచి ఆరేళ్ళ కాలంపాటు తమ ఓటు హక్కును కోల్పోతారు. సెక్షన్ 171 E కింద అవినీతి, లంచగొండితనం నేరాలు ఋజువై ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్ష లేక వెయ్యి రూపాయల జరిమానా లేక రెండూ విధించబడినా ; 171F కింద ఎన్నికల ప్రక్రియలో జోక్యం కల్పించుకొని నిబంధనలను ఉల్లంఘించి, ఎన్నికల అధికారులపై ఒత్తిడి తెచ్చినవారికి ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్ష లేక వెయ్యి రూపాయల

జరిమానా లేక రెండూ విధించబడినా -- అటువంటి వ్యక్తులు ఆ శిక్ష విధించబడిన తేదీ నుంచి ఆరేళ్ళపాటు తమ ఓటు హక్కును కోల్పోతారన్నమాట. రేపు జగన్ అక్రమాస్తుల కేసులో చేయబడిన వివిధ నేరారోపణలలో ఏ ఒక్కటి ఋజువైనా అతనికి పదేళ్లకు తక్కువ శిక్ష పడదు. అప్పుడిక పై నిబంధనల ప్రకారం అతను శిక్ష విధించబడిన తేదీ నుంచి ఆరు సంవత్సరాల కాలంపాటు తన ఓటు హక్కును, దాని కారణంగా సంక్రమించిన యం. పి. / యం. యల్. ఏ. పదవినీ కోల్పోతాడు. అంతేకాదు ; శిక్ష ఖరారైన తేదీ నుంచి ఆరేళ్ళ పాటు అతను తిరిగి ఎన్నికలలో పోటీ చేయడానికి కూడా అనర్హుడవుతాడు. నేరం ఋజువై ఆర్థిక నేరాల కోర్టులో శిక్ష కూడా పడిన తాజా మాజీ మంత్రి కొలుసు పార్థసారథి ఆ శిక్ష అమలుపై హైకోర్టు నుంచి స్టే తెచ్చుకుని చివరివరకు మంత్రిగా తన పదవిలో కొనసాగారు. ఆ తరవాత కాంగ్రెస్ పార్టీకి రాజీనామాచేసి, తెలుగుదేశం పార్టీలో చేరే ప్రయత్నం చేసి విఫలమై చివరికి వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారాయన. జగన్ ఆయనవద్ద 50 కోట్ల రూపాయలు తీసుకుని ఆయనకు ఈ ఎన్నికలలో మచిలీపట్నం పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చారని అదే పార్టీ నేత, మాజీ మంత్రి కఠారి ఈశ్వర కుమార్ ఆరోపించిన విషయం మనందరం పత్రికలలో చూశాం. జగన్ తో పాటు 14 నెలల కాలం చంచల్ గూడా కేంద్ర కారాగారంలో ఖైదీగా సహజీవనం చేసిన మరో ముద్దాయి మాజీ మంత్రి మోపిదేవి వెంకట రమణ నిస్సిగ్గుగా యువజన, శ్రామిక, రైతు కాంగ్రెస్ పార్టీ తరఫున రేపల్లె అసెంబ్లీ నియోజక వర్గం నుంచి పోటీచేసి ఓడిపోయారు. అలాగే శ్రీకాకుళం జిల్లాకు చెందిన మాజీ మంత్రి, సిబిఐ కేసులలో చిక్కుకున్న ధర్మాన ప్రసాదరావు కూడా అదే పార్టీ టికెట్ మీద అసెంబ్లీకి పోటీ చేసి ఓడిపోయారు. తీవ్రమైన నేరాలు మోపబడి, బలమైన ఆధారాలతో వివిధ సెక్షన్ల కింద విచారణ జరుపబడుతున్న ఇంకెందరో ఈ తరహా వ్యక్తులకు ఇటువంటి నేరాలకు ప్రస్తుతం కోర్టుల్లో సాగుతున్న విచారణ తరువాత కనీసం ఒక్క సంవత్సరం శిక్షపడినా చాలు; పై సెక్షన్ల కింద వారంతా తమ ఓటు హక్కునూ, దాని ద్వారా సంక్రమించిన పదవులనూ శిక్ష విధించిన తేదీ నుంచి ఆరేళ్ళపాటు కోల్పోతారు. అందుకే ఇలాంటి వారిని ఈ ఎన్నికలలో తిరస్కరించి ప్రజలు తెలివైన పనే చేశారు. అయితే ఈ ఎన్నికలలో గెలిచిన జగన్ బృందంలో జగన్ కాక మరికొందరు కూడా తీవ్ర ఆర్థిక నేరాలకు పాల్పడి, విచారణలను ఎదుర్కొంటున్నవారున్నారని సమాచారం. అటువంటివారు కేవలం జగన్ పార్టీలోనే కాదు ; ఇతర పార్టీలలోనూ ఉండి ఉండవచ్చు. అంతెందుకు ? ఈసారి ఎన్నికలలో దేశవ్యాప్తంగా లోక్ సభకు గెలిచినవారిలో 32 శాతం నేర చరిత్ర కలిగినవారేనని పలు పత్రికలలో వార్తలొచ్చాయి. ఇది ఆందోళన కలిగించే విషయం. అలాంటి తీవ్ర ఆర్థిక నేరస్థులకు ఎట్టి పరిస్థితులలోనూ టికెట్లు ఇవ్వరాదని అన్ని పార్టీలూ తీర్మానాలు చేసి వాటిని చిత్తశుద్ధితో అమలుపరచాలి. ఆర్థిక నేరస్థులు కూడా 'వైట్ కాలర్ క్రిమినల్స్' అని గుర్తించి, బాధ్యతగల పౌరులు అలాంటివారికి Vote వేయరాదు. బాధ్యతగల పౌరులు సంబంధిత అధికారులకు ఎప్పటికప్పుడు ఈ తరహా నేరస్థుల నేర చరిత్ర విషయమై

తగు సమాచారం అందిస్తూ అధికారులకు సహకరిస్తే చట్ట వ్యతిరేక, నేర పూరిత వ్యక్తిత్వం కల వ్యక్తుల్ని ఎన్నికల ప్రక్రియకు దూరంగా ఉంచే అవకాశముంది.

**నామినేషన్ ఫారాల దాఖలు - అఫిడవిట్లు**

ఎన్నికలలో పోటీచేసే ప్రతి అభ్యర్థీ నిర్ణీత గడువు లోపల తాను స్వయంగా కానీ, లేక తన ప్రతినిధి ద్వారా కానీ సంబంధిత నియోజకవర్గ రిటర్నింగు అధికారికి రెండు సెట్ల నామినేషన్ ఫారాలు దాఖలు చేయాలి. తాను ఏదైనా రిజిస్టర్డ్ పార్టీ తరఫున అభ్యర్థిగా పోటీ చేస్తుంటే, ఆ పార్టీ తనకు ఇచ్చిన బి- ఫారం ప్రతిని దానికి జతపరచాలి.అప్పుడే ఆ అభ్యర్థికి ఆ రాజకీయ పార్టీ ఎన్నికల గుర్తును కేటాయిస్తారు. లేని పక్షంలో ఆ అభ్యర్థిని ఇండిపెండెంటుగా పరిగణించి, వేరే ఏదో ఒక గుర్తు కేటాయిస్తారు. తన నామినేషన్ తో పాటు సెక్యూరిటీ డిపాజిట్, అవసరమైన ధృవపత్రాలు, తాను స్వయంగా సంతకం చేసిన 'అఫిడవిట్' లను జతపరచాలి. ఇంతకు ముందు ఎన్నికలలో ఆ 'అఫిడవిట్' లోని అన్ని కాలమ్స్ అభ్యర్థులు సరిగా పూర్తి చేశారా? లేదా? అనే విషయం ఎన్నికల అధికారులు పెద్దగా పట్టించుకునేవారు కాదు. ఇటీవల ఎన్నికల నిబంధనలలో వచ్చిన మార్పుల కారణంగా ఇటీవలి ఎన్నికలలో అభ్యర్థులు తమ అఫిడవిట్లలోని అన్ని కాలమ్స్ నూ విధిగా సక్రమంగా పూర్తిచేయాలని అధికారులు పట్టుపడుతున్నారు. ఈ 2014 ఎన్నికల నుంచీ ఈ నియమం తు.చ. తప్పకుండా అమలుచేస్తున్నారు. బి. జె. పి. ప్రధాని అభ్యర్థి నరేంద్ర మోదీ ఇంతకు పూర్వం తాను పోటీ చేసిన అన్ని ఎన్నికలలో తన భార్య వివరాలు తెలియజేయాల్సిన కాలమ్ ఖాళీగా వదిలేసేవారట. చాలా ఏళ్ళ నుంచీ వేరుగా జీవిస్తున్న ఆమె వివరాలు అందరికీ తెలపడం ఆయనకు ఇష్టముండక ఎప్పుడూ వాటిని తెలిపేవారు కాదు. ఆ కారణంగా అందరూ ఆయన్ని బ్రహ్మచారి అని పొరపాటుగా అనుకునేవారు. అయితే ఎన్నికల నియమావళిలో వచ్చిన మార్పుల కారణంగా ఆయన తన భార్య పేరు, వివరాలు అఫిడవిట్ లో ప్రకటించడం ఇప్పుడు తప్పనిసరి అయింది. మారిన ఈ నియమం కారణంగానే లోకానికి ఆయన భార్య వివరాలు తెలిశాయి. అలాగే ఈ అఫిడవిట్ లో అన్ని కాలమ్స్ విధిగా పూర్తి చేయాలనే నియమం కారణంగానే జగన్ వంటి నడమంత్రపు సిరిగాళ్ళ (చూపుతున్న) ఆస్తులు ఒక ఎన్నికకూ, మరో ఎన్నికకూ అమాంతం ఎంతగా పెరిగిపోతున్నాయో కూడా మనందరికీ సాధికారికంగా తెలుసుకునే అవకాశం లభించింది. ఆ అఫిడవిట్ ఒక 'పబ్లిక్ డాక్యుమెంట్' అయిన కారణంగా సమాచార హక్కు చట్టం కింద ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకున్నవారెవరికైనా ఎన్నికల అధికారులు దాని సర్టిఫైడ్ ట్రూ కాపీని ఇస్తారు.

**మితిమీరిన వ్యయం -- డబ్బు, మద్యం, ప్రలోభాలు, దౌర్జన్యం**

పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రజాస్వామ్యం ధనస్వామ్యంగా పరిణమించడం సహజం. ఎన్నికల ఖర్చులు ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయాయి.ప్రతిఫలం ఏమీ ఆశించకుండా ఎన్నికలలో పార్టీ ప్రచారం కోసం జెండాలు మోస్తూ అభ్యర్థి వెంట తిరిగే స్వచ్ఛంద కార్యకర్తలు ఇవాళ దాదాపు అన్ని పార్టీలకూ కరవయ్యారు. రోజుకు వెయ్యి రూపాయల ఫీజు మాత్రమే కాదు; మద్యం, మాంసాహారం అదనంగా ఆశిస్తున్నారు నేటి ఈ 'కార్యకర్తలు'. ఈసారి ఎన్నికలలో పార్టీలు నిర్వహించిన దాదాపు అన్ని రోడ్ షోలు, సభలలో ఈ 'కార్యకర్తల' కోలాహలమే ఎక్కువగా కనిపించింది. ఎందుకో తెలియకుండానే తాగిన మత్తులో జోగుతూ మాటిమాటికీ ఒకటే ఈలలూ, చప్పట్లూ. ఈ రణగొణ ధ్వనుల్లో ఇంకా నేతల ప్రసంగాలు ఏం వినగలం ? అందుకే నా వంటి సామాన్యులు ఎందఱో ఎన్నికలసభలకు వెళ్ళడం మానేసి, ఇళ్ళలో టి. వి.లకే అతుక్కుపోయారీసారి. ఆ యా పార్టీ జెండాలు మోస్తూ బ్రాందీ షాపుల ముందు హుషారుగా మద్యం సేవిస్తూన్న, దళారులు పంచే డబ్బును స్వీకరిస్తున్న ఈ 'కార్యకర్తల' దృశ్యాలను మనం పత్రికలలో, టి.వి. లలో అడపా దడపా చూస్తూనే ఉన్నాం. ఆరోజు ప్రచారం ముగిసిన తరువాత 'ఫీజు' చెల్లింపులో కాస్తంత జాప్యం జరిగితే రెచ్చిపోయి, పార్టీ నేతలపై శివాలెత్తిన 'కార్యకర్తల' దృశ్యాలు కూడా ఆ మధ్య కొన్ని చానెళ్ళలో ప్రసారమయ్యాయి. ఈ 'కార్యకర్తలు' కాక ప్రతి సభకూ, రోడ్ షోకూ సామాన్య జనాన్ని తరలించుకు వచ్చేందుకు అయ్యే వ్యయం కూడా అంతా ఇంతా కాదు. ఈ ఎన్నికలలో సభలకు హాజరయ్యే అలాంటి జనానికి కూడా అవసరాన్నిబట్టి సభకు ఐదు వందల రూపాయల చొప్పున ఇచ్చారంటే ధనవ్యయం ఏ స్థాయిలో ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. పెరిగిన వాహనాల అద్దెలు, డీజిల్ రేట్ల కారణంగా జనాన్ని తరలించడం కూడా అమిత వ్యయ ప్రయాసలతో కూడుకున్న పనే అయింది. ఎన్నికల ప్రకటన వెలువడి, పోలింగు ముగిసే వరకు నియోజకవర్గ కేంద్రంలోనూ, ముఖ్య గ్రామాలలోనూ అభ్యర్థి తన ఎన్నికల కార్యాలయాలు నిర్వహించాలి. వీటి అద్దెలు, కార్యాలయ నిర్వాహకులకు జీతభత్యాలు సరేసరి. ఆర్భాటంగా నామినేషన్ వేసేరోజు జనం తరలింపు,మద్యం, భోజనాలు, బాణాసంచా వగైరాలపై అయ్యే ధనవ్యయం లెక్కించడం ఎన్నికల సంఘం నియమించిన ఆడిటర్లకు సాధ్యపడే పనేనా ? మన రాష్ట్రం వంటి పెద్ద రాష్ట్రాలలో పార్లమెంటుకు పోటీ చేసే ఒక అభ్యర్థి గరిష్ఠంగా 70 లక్షల రూపాయలకు మించి ఖర్చుచేయరాదు. పెరిగిన ధరవరలు, నోట్ల ముమ్మరం వగైరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఇటీవలే ఈ గరిష్ఠ వ్యయ పరిమితిని పెంచింది. మరి ఎంతమంది లోక్ సభ అభ్యర్థులు ఈ గరిష్ఠ పరిమితికి లోబడి ఖర్చు చేస్తున్నారు?

**పార్టీలు టికెట్లు అమ్ముకొనడం**

తోరణాలు, జెండాలు, కరపత్రాలు, పోస్టర్లు వగైరా ప్రచార సామగ్రిని దాదాపు అన్ని పార్టీలు ఆ యా పార్టీల కేంద్ర కార్యాలయాల నుంచే సరఫరా చేస్తాయి. అలా అయితేనే నియోజకవర్గంలో ప్రచార నిర్వహణ ప్రత్యర్థుల ప్రచారానికి దీటుగా ఉండగలదని, తమ పార్టీ అభ్యర్థులందరి ప్రచారం ఆశించిన రీతిలో ఒకే స్థాయిలోనూ ఉండగలదనీ భావించి, అభ్యర్థుల నుంచి కొంత మొత్తం తీసుకుని, ఈ ప్రచార సామగ్రిని పార్టీ నాయకత్వమే అభ్యర్థులకు సరఫరా చేస్తున్నది. అలాగే సహజంగానే ఆర్థిక బలం మెండుగా కలిగిన పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థులు తమ తమ నియోజకవర్గాలలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలోని పార్టీ అభ్యర్థుల ఖర్చులో కొంత శాతాన్ని భరించడం కూడా ఆనవాయితీగా మారింది. ఇదికాక పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలోని యస్.సి. / యస్. టి. రిజర్వుడు అసెంబ్లీ సీట్లకు పోటీ చేస్తున్న అభ్యర్థులలో ఎవరికైనా తగినంత ఆర్థిక స్తోమత లేని పక్షంలో వారికి ఆ యా పార్టీల అధినాయకత్వమే ప్రచార సామగ్రి ఉచితంగా ఇచ్చి, ఇంకా వారికి అవసరమైన ధన సహాయం కూడా చేసి ఆదుకోవాల్సి వస్తుంది. ఇందుకోసం కూడా పార్టీల కేంద్ర నాయకత్వం లోక్ సభ అభ్యర్థుల నుంచి ఆ యా సందర్భాన్ని బట్టి కొంత మొత్తం వసూలు చేస్తారు. అభ్యర్థులు వ్యక్తిగతంగా చేసుకునే ఎన్నికల ప్రచారం మాత్రమే కాక రాజకీయ పార్టీలు ఎలక్ట్రానిక్ మరియు ప్రింట్ మీడియాలలో చేసే అత్యంత ఖరీదయిన ఎన్నికల ప్రచారానికి అయ్యే ఖర్చులో కూడా ఆ యా అభ్యర్థుల వాటాను వారినుంచి పార్టీలు వసూలు చేస్తాయి. ప్రతి రాజకీయ పార్టీ మనుగడకు ఇది తప్పనిసరి. ఇలాంటి వసూళ్ళను గురించే 'పార్టీల అగ్రనేతలు టికెట్లు అమ్ముకుంటున్నార'ని కొందరు సహజంగానే ప్రచారం చేస్తుంటారు. 'మఖలో పుట్టి పుబ్బలో గిట్టే' కొన్ని అవకాశవాద రాజకీయ పార్టీలు, పిల్ల పార్టీలు, తోక పార్టీల విషయంలో అభ్యర్థులకు టికెట్లు ఇచ్చే సందర్భంలో పెద్ద మొత్తాలు చేతులు మారతాయనే విషయం వాస్తవం అయితే కావచ్చు కూడా. తమ పార్టీ మనుగడ ఎంతకాలమో తెలియని ' ఏక్ దిన్ కా సుల్తాన్' లు ఎన్నికలలో ఎటుతిరిగీ గెలవబోమని ఇలా టికెట్లు అమ్ముకున్న డబ్బులైనా వెనకేసుకుందామని ఆలోచించడం సహజమే కదా ! ఏమయితేనేం ఇవాళ ఎన్నికల ప్రక్రియ యావత్తూ డబ్బు మయం అయిపోయింది. అందుకే ఇవాళ ధరావతు చెల్లించి, ఎన్నికల కమిషన్ నిర్దేశించిన పరిమితులలోపు మాత్రమే ధన వ్యయం చేసి గెలవగలిగే పరిస్థితి సామాన్యులెవరికీ లేదు-- వందల కోట్ల ఆస్తులున్నవారికి తప్ప. రాజకీయ పార్టీలు కూడా అసామాన్యులకేగానీ సామాన్యులకు టికెట్లు ఇచ్చి, ప్రయోగాలు చేసి చేతులు కాల్చుకొనడానికి సిద్ధంగా లేవు. ఎందుకంటే ఇదే అదనుగా భావించి, తాము టికెట్ ఇచ్చిన ఆ సామాన్యుడిపై అవతలి పక్షం వారు కాసు బలం, కండబలం దండిగా కల అభ్యర్థిని రంగంలోకి దించి లాభపడే అవకాశముంది. అందుకే ఎన్నికల వ్యయాన్ని అదుపు చెయ్యడానికి రాజకీయపార్టీలన్నీ ఒక ఏకాభిప్రాయానికి వస్తేనే అటువంటి వ్యయనియంత్రణ సాధ్యపడుతుంది.

## తారెత్తిస్తున్న డబ్బు, మద్యం ప్రభావం

అంతేకాదు; డబ్బు, మద్యం తీసుకున్నా ఓటర్లు వాళ్ళు అనుకున్న అభ్యర్థులకే ఓటు వేస్తారుగానీ, 'నిజాయతీ' గా విశ్వాసపాత్రంగా తమకు డబ్బు, మద్యం ఇచ్చినవారికే ఓటు వేయటోరని ఒకటికి రెండుసార్లు రుజువుకావాలి. ఓటర్లు పుట్టి ముంచుతారనే భయం అభ్యర్థులలో ఏర్పడితే ఎన్నికల ప్రక్రియలో డబ్బు, మద్యం పాత్ర క్రమంగా తగ్గిపోతుంది. ప్రస్తుతం ఆ రెండూ పంచకపోతే ఇతరులకంటే ఎక్కడ వెనకబడిపోతామోనని ఇష్టం ఉన్నా లేకున్నా పార్టీలన్నీ తమ శక్తికొలది ఇలాంటి అవాంఛనీయమైన పనులు చేయడానికే అలవాటుపడ్డాయి.అలా ఎన్నికలలో ఇదొక తప్పనిసరి లాంఛనం అయికూర్చుంది - మరీ మన రాష్ట్రంలో మరింతగా. ఈసారి ఎన్నికల సందర్భంగా దేశం మొత్తం మీద జరిగిన సోదాలలో పట్టుబడ్డ అక్రమ మద్యం, ఎన్నికలలో పంచడానికి ఉద్దేశించిన కోట్లాది రూపాయల డబ్బులో సగ భాగం కంటే ఎక్కువే మన రాష్ట్రంలో పట్టుబడిందంటే మన రాష్ట్రంలో జరిగే ఎన్నికలలో ఈ రెంటి ప్రభావం ఎంత తీవ్రంగా ఉన్నదో గ్రహించవచ్చు. మన రాష్ట్రంలో పట్టుబడ్డ డబ్బు, అక్రమ మద్యంలో 90 శాతం వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ వారికి చెందినవేనని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది.ఒకే కేసులో అత్యధిక మొత్తం పట్టుబడిన రికార్డు కూడా ఆ పార్టీ వారికే దక్కింది. భీమవరంలోని ఒక షోరూంలోని ఒక కారులో దొరికిన సుమారు మూడున్నర కోట్ల రూపాయల డబ్బు పశ్చిమ గోదావరి జిల్లా ఉండి అసెంబ్లీ నియోజక వర్గాన్నుంచి పోటీ చేసిన వైయస్ ఆర్ కాంగ్రెస్ అభ్యర్థి పాతపాటి సర్రాజుదని ప్రాథమిక విచారణలో తేలింది. గుంటూరు జిల్లా పొన్నూరు నియోజకవర్గ వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రావి వెంకటరమణ తన మిల్లులో నిల్వచేసిన కేసులకొద్దీ అక్రమ మద్యం అధికారులకు పట్టుబడింది. ఇది రాష్ట్రంలోనే అతి పెద్ద మద్యం స్వాధీన కేసుగా నమోదయింది. ఇలాంటి పలు కేసుల్లో ఆ పార్టీ అభ్యర్థులు, కార్యకర్తలపై కేసులు పెట్టడం, కొందరు ఆ పార్టీ అభ్యర్థుల్ని అరెస్టు చేయడం కూడా జరిగింది. ఎన్నికలకు ముందు పంపిణీని నిరోధించేందుకు ఇంత డబ్బు, మద్యం పోలీసులు స్వాధీనపరచుకున్నా ఆ పార్టీవారు ఇంతకింత వేరే మార్గాల ద్వారా తెచ్చి ఓటర్లకు పంచేశారు. మరో ముఖ్యమైన విషయమేమిటంటే -- మిగిలిన అన్ని పార్టీలకంటే ఎంతో ముందుగానే యువజన, శ్రామిక, రైతు (వైయస్ ఆర్) కాంగ్రెస్ పార్టీ తన అభ్యర్థులను ప్రకటించిన కారణంగా ఆ పార్టీ అభ్యర్థులకు పోలీసులు పికెట్లు ఏర్పాటుచేసి, తనిఖీలు ముమ్మరం చేయకముందే రాష్ట్రంలోని మారుమూల గ్రామాలకు కూడా డబ్బు, మద్యం సునాయాసంగా చేర్చే సువర్ణావకాశం లభించిందనీ, పోలింగు తేదీకి ముందే వారు వాటిని గ్రామాలలో పంచిపెట్టి, గ్రామీణుల చేత తమ పార్టీకే ఓట్లు వేస్తామని కులపెద్దల సమక్షంలో పవిత్ర గ్రంథాల మీద ప్రమాణాలు కూడా చేయించుకున్నారని పత్రికల్లో వార్తలొచ్చాయి. డబ్బు, మద్యం పంపిణీ విషయంలో ఇంత పకడ్బందీగా, ప్రణాళికాబద్ధంగా పనిచేసిన వైకాపా ప్రభావం కేవలం మూడు,

నాలుగు జిల్లాలకు మాత్రమే పరిమితం కావడం,కొన్ని జిల్లాల ప్రజలు ఆ పార్టీని ఊచముట్టుగా తుడిచిపెట్టడం, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గంలో పోటీచేసిన ఆ పార్టీ గౌరవాధ్యక్షురాలు శ్రీమతి వై యస్ విజయలక్ష్మిని అక్కడి ప్రజలు చిత్తుగా ఓడించడం చూస్తే ఎన్నికలలో డబ్బు, మద్యం పంచినా ప్రజలు వారికి నచ్చినవారికే ఓట్లు వేస్తున్నారుగానీ, గంపగుత్తగా అమ్ముడుపోవడం లేదని గ్రహించగలం. ఇక్కడ మరో చిత్రమైన విషయం కూడా గమనించాలి. వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు కొందరు పంచిన మద్యంలో కొంత చవకబారు కల్తీ మద్యం అయిన కారణంగా, అది తాగి నలుగురు వ్యక్తులు మరణించారు.దానికి తోడు ఆ పార్టీ అభ్యర్థులు కొందరు పంచిన నోట్లు నకిలీవని కూడా కొన్నిచోట్ల బయటపడింది. ఈ కేసులలో అరెస్టు కాబడ్డ వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు/కార్యకర్తల మీద ఆ మేరకు కోర్టుల్లో కేసులు కూడా నమోదయ్యాయి. 'ప్రభుత్వాలనూ, బాంకులనూ మోసం చేసి లక్ష కోట్ల రూపాయల ఆస్తుల్ని అక్రమంగా ఆర్జించిన జగన్ చివరకు కల్తీ మద్యం, దొంగనోట్లు ఇచ్చి తమనుకూడా మోసగిస్తాడా !' అని సామాన్య జనం చివరి దశలో -- అంటే పోలింగుకు ఒకటి రెండు రోజుల ముందు-- ఆయన పార్టీ పట్ల వ్యతిరేకత పెంచుకున్నారట ! అంతకు పూర్వం దాదాపు అన్ని సర్వేలూ జగనే కాబోయే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అని అంచనా కట్టినా ఈ కల్తీ మద్యం, దొంగనోట్ల పంపిణీ ప్రహసనమే ఎన్నికల ఫలితాలలో ప్రతిఫలించి, జగన్ విజయావకాశాలను తీవ్రంగా దెబ్బతీసిందట !! కత్తితో ఆటాడేవాడు అంతిమంగా ఏదో ఒక రోజు ఆ కత్తికే బలవుతాడనే నానుడి ఇలా మరోసారి మన ఆంధ్రప్రదేశ్ లో జరిగిన 2014 సాధారణ ఎన్నికలలో ఋజువైందన్నమాట !!!

ఓటర్లపై రాజకీయ నేతలు ప్రలోభాల వల వేసి, వారిని ప్రభావితం చేయకుండా చూసేందుకు ఎన్నికల కమిషన్ ఎన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నా, ఇంకా ఎన్నికల ప్రచార సభలలో నేతలు తమ ప్రసంగాలలో ప్రలోభాలను గుప్పిస్తూనే ఉన్నారు. ఇందుకు ప్రస్తుత ఎన్నికలలో పోటీ పడిన ఏ రాజకీయ పార్టీ, ఎన్నికల ప్రచారం చేసిన ఏ నేతా మినహాయింపు కాదు.

**దౌర్జన్య సంస్కృతికి వ్యతిరేక ఓటు**

ఈ ఎన్నికలలో రాష్ట్ర ప్రజలు- ముఖ్యంగా శాంతికాముకులైన ఉత్తర కోస్తా ప్రజలు- కడప తరహా దౌర్జన్యపూరితమైన సంస్కృతి పట్ల తమ తీవ్ర నిరసనను వ్యక్తం చేశారు. ఉత్తర కోస్తా జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల ప్రజలు వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల్ని చిత్తుగా ఓడించడం ద్వారా తాము దౌర్జన్య సంస్కృతికి పూర్తిగా వ్యతిరేకమని స్పష్టం చేశారు.

అదెలాగో చూద్దాం. మొత్తం పది అసెంబ్లీ నియోజకవర్గాలు కల శ్రీకాకుళం జిల్లాలో ఏడింటిని తెలుగుదేశం పార్టీ భారీ మెజారిటీలతో (4,951 నుంచి 25,038 లోపు ఆదిక్యతలతో ) గెలుచుకోగా, ఆ పార్టీకి చెందిన మాజీ శాసనసభ స్పీకర్ శ్రీమతి కె. ప్రతిభా భారతి రాజాం నియోజకవర్గంలో కేవలం 512 ఓట్ల తేడాతో వై యస్ ఆర్ సీ పీ అభ్యర్థి కంబాల జోగులు చేతిలో ఓడిపోయారు. ఓడిపోయిన మిగిలిన ఇద్దరు తెదేపా అభ్యర్థులు మాజీ మంత్రి శ్రీ శత్రుచర్ల విజయరామరాజు పాతపట్నంలో 3812 ఓట్ల తేడాతోనూ, శ్రీ నిమ్మక జయకృష్ణ పాలకొండలో కేవలం 1543 ఓట్ల తేడాతోనూ ఓడిపోయారు. విజయనగరం జిల్లాలోని మొత్తం తొమ్మిది అసెంబ్లీ నియోజకవర్గాలలో తెదేపా ఆరింటిని గెలుచుకుని స్పష్టమైన ఆధిక్యతను ప్రదర్శించింది. విశాఖపట్నం జిల్లాలోని మొత్తం 15 అసెంబ్లీ నియోజక వర్గాలలో 11 తెదేపా, ఒకటి దాని మిత్రపక్షమైన భాజపా గెలుచుకోగా, అటవీ ప్రాంతంలో ఉన్న అరకు, పాడేరు, మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గాలను మూడింటిని మాత్రమే వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ దక్కించుకోగలిగింది. అలాగే తూర్పు గోదావరి జిల్లా ప్రజలు కడప ఫాక్షనిస్టు సంస్కృతికి వ్యతిరేకంగా తిరగబడి వై యస్ ఆర్ కాంగ్రెస్ ను మొత్తం 19 నియోజక వర్గాలలో ఐదింటికి మాత్రమే పరిమితం చేశారు. ఇక పశ్చిమ గోదావరి జిల్లాలో ఉన్న మొత్తం 15 స్థానాలనూ తెదేపా, భాజపా కూటమి తుడిచి పెట్టింది. అలాగే ఉత్తర కోస్తాలోని మొత్తం 10 లోక్ సభ నియోజకవర్గాలలో అటవీ ప్రాంతమైన ఒక్క అరకు పార్లమెంటు నియోజకవర్గాన్ని మాత్రం వై యస్ ఆర్ కాంగ్రెస్ దక్కించుకోగా, మిగిలిన తొమ్మిది లోక్ సభ నియోజక వర్గాలలోనూ తెదేపా - భాజపా కూటమే భారీ ఆధిక్యతలతో గెలిచింది.

**వైకాపా దౌర్జన్య కాండ**

ఆంధ్రప్రదేశ్ లో పోలింగు తేదీ అయిన మే 7 న జరిగిన దౌర్జన్య కాండను మనమంతా టీవీలలో చూశాం. కడప జిల్లా జమ్మలమడుగు ప్రాంతంలో రిగ్గింగును ఎదుర్కొనడానికి అదనపు పోలీసు బలగాలను కొన్ని గ్రామాలలోకి తరలించడం పోలీసులకు కూడా సవాలుగా మారింది. ఆ క్రమంలో వైకాపా వారు చేసిన దాడులలో తెదేపా కార్యకర్తలకే కాదు; కొందరు పోలీసు అధికారులకు కూడా తీవ్రగాయాలయ్యాయి. గత 30 -35 సంవత్సరాలనుంచి ప్రతిపక్షాలనుగానీ, వారి ఏజెంట్లనుగానీ అడుగుకూడా మోపనీయకుండా ఏకపక్షంగా, యథేచ్ఛగా రిగ్గింగు చేసుకుంటున్న గ్రామాలవి మరి ! ఇన్నేళ్ళూ ఊరుకుని ఇప్పుడు ప్రతిపక్షాలు, పోలీసులు ఆ ఊళ్ళలోకి వెళ్లి రిగ్గింగును నిరోధిస్తామంటే పాపం సీమ పెత్తందార్లు ఊరుకుంటారా ? ఈ ఎన్నికలలో మొత్తంగా వైకాపా దౌర్జన్యకాండ పేట్రేగిపోయినా పోలీసు అధికారులు సమర్థంగా వ్యవహరించలేదని టి వి లలో ప్రసారమైన దృశ్యాలు చూసిన ఎవరికైనా అర్థమవుతూనే ఉంది. దాదాపు అన్ని సమస్యాత్మక ప్రాంతాలలోనూ పోలీసు అధికారులు తమతోపాటు వాళ్ళుకూడా రాళ్ళదెబ్బలు భరిస్తూ కూడా నిమ్మకు నీరెత్తినట్లుండడం ఆశ్చర్యం కలిగించే విషయమని స్థానిక బాధితులు వాపోయినట్లు

పత్రికల్లో వార్తలొచ్చాయి. దౌర్జన్యకారుల్ని అదుపుచేసే సర్వాధికారాలూ కలిగిన పోలీసులు కూడా ఇలా మౌన ప్రేక్షక పాత్రకు పరిమితం కావడానికి కారణాలు రెండు కావచ్చు.

ఒకటి : కేంద్ర యు. పి. ఏ. ప్రభుత్వం ఎన్నికలకు బాగా ముందే అధికారుల్ని ఇలా స్పష్టంగా ఆదేశించి ఉండవచ్చు - - "ఆంధ్రప్రదేశ్ లో తెదేపాని ఓడించడం ఒక్క వైకాపాకే సాధ్యం. వాళ్ళు గెలిచినా చివరికి కాంగ్రెస్ నే బలపరుస్తారు. కాబట్టి వాళ్ళు ఎంతగా దౌర్జన్యకాండకు పాల్పడినా మీరు సంయమనం పాటించండి. ఎక్కడా సహనం కోల్పోవద్దు."

రెండు : 'వస్తున్నాడు' , 'దుమ్ము దులిపేస్తాడు' వగైరా ప్రచార ఆర్భాటాన్ని చూసి, వైకాపా వారు సొంతంగా డబ్బులిచ్చి చేయించుకున్న సర్వే ఫలితాలు చూసి నిజమని నమ్మిన పోలీసు అధికారులు రానున్న ప్రభుత్వంలో కానున్న ముఖ్యమంత్రికి మనమెందుకు వ్యతిరేకం కావాలని- ఆయనతో, ఆయన పార్టీతో వీలయినమేరకు సయోధ్యగానే వ్యవహరిద్దామనే నిర్ణయానికి వచ్చి ఉండొచ్చు.

పోలింగు రోజున పోలీసు అధికారుల నిష్క్రియాపరత్వానికి ఈ రెండూ కాక వేరే కారణాలేవీ ఉండే అవకాశం నాకైతే కనిపించడం లేదు.

ఇక ఫాక్షన్ రాజకీయాలకు దూరంగా ఉండే ప్రశాంతమైన చిత్తూరు జిల్లాలోని చంద్రగిరి నియోజక వర్గంలో సైతం వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ వారు రిగ్గింగుకు పూనుకుని, పత్రికా విలేఖరులను సైతం కొన్ని గ్రామాలలోకి వెళ్ళనీయకుండా అడ్డుకుని వారి వాహనాలను ధ్వంసం చేయడం, పోలీసులపైన తిరగబడి వారినీ, విలేఖరులనూ తీవ్రంగా నెత్తురు కారేటట్లు కొట్టడం మనమందరం టీ వీ ప్రసారాల్లో ప్రత్యక్షంగా చూశాం.ఇలాంటి దౌర్జన్యపూరిత పద్ధతులద్వారా మాత్రమే అక్కడ ఆ పార్టీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి కేవలం నాలుగువేల ఓట్ల మెజారిటీతో గెలిస్తే గెలిచి ఉండొచ్చుగానీ ప్రశాంతమైన చిత్తూరు జిల్లాలోకి కడప సంస్కృతిని ప్రవేశపెట్టిన ఘనత మాత్రం తప్పనిసరిగా ఆయనకే దక్కుతుంది.

తిరుపతి అసెంబ్లీకి తెదేపా అభ్యర్థిగా పోటీ చేసిన వెంకటరమణపై వ్యక్తిగతంగా దాడిచేసి చెంపమీద కొట్టిన మరో దౌర్జన్యకారుడు తిరుపతి వై సి పి అభ్యర్థి భూమన కరుణాకర రెడ్డిని 7500 ఓట్ల తేడాతో ఓడించి, కసి తీర్చుకున్నారు తిరుపతి ప్రజలు. ఇలా చెప్పుకుంటూ పోతే రాష్ట్రంలో ఎన్నికల తేదీనాడు, ఆ తరువాత వై కా పా వారు పాల్పడిన హింసాకాండ గురించి సాక్ష్యాధారాలతో సహా ఎంతైనా రాయవచ్చు. ఒక్క 'సాక్షి' తప్ప అన్నిపేపర్లూ, చానల్సూ ఈ హింసను పూర్తి ఆధారాలతో వెలుగులోకి తెచ్చాయి. ఎన్నికలలో ఇంతగా హింసకు పాల్పడడం వెనుక వైకాపా వారి లక్ష్యం మాత్రం వేరు. పైకి ఆ పార్టీ నేతలు 'అధికార పీఠం మాదే' అని ఎంతగా మేకపోతు గాంభీర్యం ప్రదర్శించినా సాధారణ ఎన్నికలకు ముందు జరిగిన మునిసిపల్, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల పోలింగు సందర్భంగానే వారి బలమేమిటో వారికి స్పష్టంగా అర్థమయింది.

అందుకే తెలంగాణలో టి ఆర్ యస్, ఆంధ్రప్రదేశ్ లో వైకాపా సాధారణ ఎన్నికల పోలింగుకు ముందు స్థానిక ఎన్నికల ఫలితాలు ప్రకటించరాదని కోరుతూ స్టే కోసం కోర్టుకు వెళ్లి ఆ ప్రయత్నంలో సఫలమయ్యాయి. ఆ ఫలితాలు సాధారణ ఎన్నికల  పోలింగుకు ముందే ప్రకటిస్తే సాధారణ ఎన్నికలలో వైకాపా మరింతగా  దెబ్బతిని ఉండేదన్నది మాత్రం నిజం. విద్యావంతులు, మేధావులు, మధ్యతరగతి వారు వైకాపాని ఎటుతిరిగీ ఆదరించరు. పైపెచ్చు సాధారణంగా  పోలింగుకు వెళ్ళడానికి కూడా ఇష్టపడని  ఈ సెక్షన్ల  ప్రజలు ఈ సారి వైకాపాకి వ్యతిరేకంగా ఓటు వేసి రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఎలాగైనా కాపాడుకోవాలనే కృతనిశ్చయంతో ఉన్నారని పసిగట్టిన వైకాపా నేతలు పోలింగు సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున హింసాకాండకు  తెగబడ్డారు. ఈ హింసకు జడిసి ఆ సెక్షన్ల ప్రజలు పోలింగుకు రారని వారు ఆశించారు. అయితే ఈ బెదిరింపులను బేఖాతరు చేస్తూ ఎన్నడూ ఓటు వేసి ఎరుగని ఎంతోమంది కూడా ఈసారి కసిగా ఓటేసి తాము అభివృద్ధిని కోరుకుంటాంగానీ,  అరాచకాన్ని కాదని నోటితో కాక ఓటుతో అతి స్పష్టంగా తెలిపారు. ఎన్నికల-పూర్వ విశ్లేషణలలో పోలింగు శాతం తక్కువగా ఉంటే వైకాపా గెలుస్తుందనీ, పోలింగు శాతాలు పెరిగేకొద్దీ అది తెదేపా గెలుపుకే తోడ్పడుతుందనీ పలువురు విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.అందుకే వైకాపా వారు పోలింగు సందర్భంగా హింసను  ప్రేరేపించి పోలింగు శాతాన్ని వీలయిన మేరకు తగ్గించాలని చూశారు. అయితే ఎన్నడూ లేని రీతిలో మండుటెండలను, హింసాత్మక ఘటనలనూ లెక్కచేయని తెలుగు ఓటర్లు భారీ సంఖ్యలో పోలింగులో పాల్గొని తమ ప్రజాస్వామ్య ఆకాంక్షలను బలీయంగా వ్యక్తపరచడమేకాదు; తమ విజ్ఞతను కూడా నిరూపించుకున్నారు.పోలింగు రోజున వైకాపా వారు పాల్పడిన హింసాత్మక ఘటనలను కొన్ని చానెళ్ళలో విశ్లేషించిన కొందరు విజ్ఞులు 'ఓడిపోయేవారే ఎప్పుడైనా హింసకు పాల్పడతారని, పోలింగు రోజున వ్యక్తమైన వారి అసహనాన్ని బట్టే వైకాపావారి ఓటమి తథ్యమని గ్రహించగలమనీ' తేల్చారు.అనుకున్నట్లే వైకాపాని మరీ చిత్తుచిత్తుగా కాకున్నా  నిర్ణయాత్మకంగా  ఓడించి తేదేపాకు పట్టంకట్టారు తెలుగు ప్రజలు. అలా ఈ ఎన్నికలలో ప్రజల తీర్పు మొత్తం కేవలం చంద్రబాబుకు అనుకూల ఓటు మాత్రమేకాదు. అది అరాచక శక్తులకు  వ్యతిరేక ఓటు కూడా.ఆర్థిక నేరాలు చేసి అనతికాలంలోనే  నడమంత్రపు సిరిగాళ్ళు (Upstarts) గా ఎదిగిన ఘరానా నేరగాళ్ళకు అదొక చెంపపెట్టు. హింసాప్రవృత్తితో రాజకీయాలను నేరపూరితం చేస్తున్న అమానవీయ శక్తులకు అదొక  గొడ్డలి పెట్టు.విశాఖ మాజీ మేయరు, అనకాపల్లి లోక్ సభ మాజీ సభ్యులు శ్రీ సబ్బం హరి 'ప్రశాంతతకు నిలయమైన విశాఖను కడప ఫాక్షనిస్టు సంస్కృతితో కలుషితం కానివ్వం. వైకాపా వారు గెలిస్తే      ( వాళ్ళు భూ బకాసురులలాగా భూమినంతా ఇప్పటికే మింగేశారు కనుక)ఇక మిగిలిన  సముద్రాన్ని కూడా  మింగేస్తారు. అందుకే అన్ని విభేదాలనూ పక్కనబెట్టి వైకాపా గౌరవాధ్యక్షురాలు విజయమ్మను

అందరం కలిసికట్టుగా కృషిచేసి ఓడిస్తాం' అని ఎన్నికలకు ముందు ప్రకటించడం గమనార్హం. ఈ ప్రకటన కడప తరహా దౌర్జన్యపూరిత, నేరమయ రాజకీయాల పట్ల ఉత్తరాంధ్ర ప్రజల తీవ్ర వ్యతిరేకతకు అద్దంపడుతున్నది.

అలా డబ్బు, మద్యం, ప్రలోభాలు, దౌర్జన్యం ఈ ఎన్నికలలో ఎంతగా వినియోగించబడినా, అంతిమంగా వాటి ప్రభావం కంటే ఓటరు విచక్షణదే పైచేయి కావడం కారణంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అరాచక స్థితికి నెట్టివేయబడే ఒక పెనుప్రమాదం నుంచి బయటపడిందని నేను గట్టిగా నమ్ముతున్నాను.

ఈ ఎన్నికలకు సంబంధించిన ఇంకొన్ని పార్శ్వాలను మరోసారి సమీక్షించుకుందాం.